
గత తహసీల్దార్ అనితపై చర్యలు తీసుకోవాలి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21 : గతంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లో పనిచేసిన తహసీల్దార్ అనితపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, జిల్లా సమితి సభ్యుడు పి.శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దారుగా అనిత ఉన్న సమయంలో జీవో నెంబర్ 59కు వ్యతిరేకంగా రెగ్యులరైజేషన్ చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు చేపట్టిన అక్రమ నిర్మాణాలకు నకిలీ ఇంటి నెంబర్లు, పన్నులను చూపి రెగ్యులరైజేషన్ చేశారని, అనిత అవినీతిపై ఏసీబీ విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన పదవి.. మిగిలిన అప్పులు

పెండింగ్‌లో బిల్లులు.. ఆందోళనలో మాజీ సర్పంచ్‌లు

- ఒక్కో పంచాయతీకి రూ.లక్షల్లో బకాయిలు
- అధిక వడ్డీలకు తెచ్చి అభివృద్ధి పనులు పూర్తి
- బంగారం, ఇళ్లు తాకట్టు పెట్టిన పలువురు సర్పంచ్‌లు
- వడ్డీలు కట్టలేక అవస్థలు.. బిల్లులకు తప్పని నిరీక్షణ
- పదవీ కాలం ముగియడంతో పెరిగిన ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో రూ.224.05 కోట్లు పెండింగ్
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



భార్య నగలు తాకట్టు పెట్టి..



ఈయన పేరు దశరథ. తాండూరు మండలం గుండ్లమడుగు తండా మాజీ సర్పంచ్. గ్రామాభివృద్ధిలో భాగంగా మరుగుదొడ్లు, స్ట్రీట్ లైట్స్, సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఈ పనులు చేసేందుకు డబ్బులు లేక తన భార్య బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.6 లక్షలు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టాడు. పూర్తి చేసిన పనులకు అధికారులు ఎంబీ రికార్డు కూడా చేశారు. బిల్లులు రాగానే నగలు విడిపించుకోవచ్చని అనుకున్నాడు. నెలలు, సంవత్సరం దాటినా బిల్లుల జాడేలేదు. ఇంతలో తన పదవీకాలం కూడా పూర్తయింది. తాకట్టు పెట్టిన నగలు విడిపించుకోలేక.. తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక నరకయాతన అనుభవిస్తున్నాడు. బిల్లుల కోసం అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నాడు. రేపుమాపు అంటూ అధికారులు చెబుతుండటంతో కాలయాపన తప్ప బిల్లులు రావడం లేదు. ఆనాటి ప్రభుత్వం పనులు త్వరగా పూర్తి చేయాలని తీవ్ర ఒత్తిడి చేసింది. తీరా అప్పులు చేసి పనులు పూర్తి చేస్తే బిల్లులు ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆయన కోరుతున్నాడు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన సర్పంచ్‌లకు పదవీకాలం ముగిసినా.. అప్పులు మాత్రం వెంటాడుతున్నాయి. ఆనాటి ప్రభుత్వ సూచన మేరకు పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు తదితర పనులన్నీ సొంత నిధులతో సకాలంలో పూర్తి చేశారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాత్రింబవళ్లు కష్టపడి పూర్తి చేశారు. ఆయా పనులకు అధికారులు ఎంబీ రికార్డు సైతం పూర్తి చేశారు. అయినా నెలలు, ఏడాది గడిచినా బిల్లులు మాత్రం రాలేదు. ఇంతలో తమ పదవీ కాలం కూడా ముగిసింది. పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన వచ్చింది. అయినా తాము పెట్టిన పెట్టుబడి సొమ్ము రాక.. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాజా మాజీ సర్పంచ్‌లు తలలు పట్టుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 1,159 పంచాయతీల్లో సుమారు రూ.224.05 కోట్లు బకాయిలు ఉన్నాయి.


రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో వేసిన సీసీ రోడ్డు

రంగారెడ్డిఅర్బన్/వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 21: గ్రామాల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఏళ్లుగా రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక తాజా మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వడ్డీకి అప్పులు తెచ్చి పనులు పూర్తి చేస్తే బిల్లుల రాక ఆర్థికంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క మేజర్ పంచాయతీల్లో రూ.20 లక్షలకు పైగా, చిన్న పంచాయతీల్లో రూ.5-10 లక్షల వరకు పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రతీ నెలా పల్లె ప్రగతి నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తున్నా.. అవి సిబ్బంది జీతాలు, ఇతర అవసరాలకే సరిపోతున్నాయి. రూ.లక్షల కొద్దీ అప్పులు తెచ్చి చేసిన పనుల బిల్లులు మాత్రం ఏళ్లు గడుస్తున్నా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ప్రభుత్వంలోనూ అదే దుస్థితి

పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలతో పాటు విద్యుత్, తాగునీటి పైపులైన్ల మరమ్మతులకు, ఇతర అత్యవసరాలకు పెట్టిన పెట్టుబడి బిల్లుల్లో సర్పంచ్‌లకు ఏది అందని పరిస్థితి. బిల్లులు వస్తాయని ఆశతో చూసిన సర్పంచ్‌ల పదవీ కాలం సైతం ఇటీవల ముగిసింది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల చేతులలోకి పాలన వెళ్లడంతో వారు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదవీ ముగిసి ఎనమిది నెలలు అవుతున్నా బిల్లులు మాత్రం రావడం లేదు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనులు పూర్తి చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా తమ పరిస్థితి ఏమీ మారలేదని ఆయా సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త ప్రభుత్వమైనా ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు.

పెండింగ్ బిల్లుల వివరాలు

నియోజకవర్గం	పంచాయతీలు	పెండింగ్ బిల్లులు (రూ.కోట్లలో)
చేవెళ్ల	132	9.6
ఇబ్రహీంపట్నం	80	4.85
మహేశ్వరం	64	9.50
షాద్‌నగర్	152	17
కల్వకుర్తి	102	5.10
వికారాబాద్	137	50
పరిగి	144	12
తాండూరు	173	06
కొడంగల్	114	65
మేడ్చల్	61	45
మొత్తం	1,159	224.05

10 నియోజకవర్గాల్లో..

సర్వతోముఖాభివృద్ధే లక్ష్యమంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు సైతం ఇస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్‌లు పెట్టిన పెట్టుబడి మాత్రం ఇవ్వడం లేదు. వారు వడ్డీలు చెల్లించలేక అప్పుల ఊబిలోకి కూరుకుపోయారు. ఉమ్మడి జిల్లాలోని 10 రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలో మొత్తం 1,159 పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో సుమారు రూ.224.05 కోట్లు బకాయిలు ఉన్నాయి.

అందని గౌరవ వేతనం

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినా వారికి రావాల్సిన పెండింగ్ గౌరవ వేతనం మాత్రం రాలేదు. ఆరు నెలలుగా చెల్లించాల్సిన వేతనం అందని పరిస్థితి. నెలకు రూ.5 వేల చొప్పున అందాల్సిన గౌరవ వేతనాలు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. నెలకో సారి ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఎప్పుడూ సక్రమంగా ఇచ్చిన దాఖలాలు లేవని వాపోతున్నారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను త్వరగా ఇవ్వాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

ఏడాదిగా ఎదురు చూస్తున్నా..



కడ్తాల గ్రామంలో రూ.20 లక్షలు వెచ్చించి పలు అభివృద్ధి పనులు పూర్తి చేశాను. చేసిన పనులకు బిల్లులు రాలేదు. ఏడాదిగా ఎదురు చూస్తున్నాను. గత, ప్రస్తుత ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా బిల్లులు మాత్రం రావడం లేదు. త్వరగా బిల్లులు చెల్లించి మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

-గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్, కడ్తాల

రూ.30 లక్షలు రావాల్సి ఉంది



పదవీ కాలం ముగిసే వరకు గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశాం. దీనికి సంబంధించి ఎంబీ రికార్డులు కూడా పూర్తయ్యాయి. రూ.30 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. నెలలుగా బిల్లుల కోసం ఎదురు చేస్తున్నాను.

-లావణ్య శంకర్, మాజీ సర్పంచ్, రామన్నగూడ, చేవెళ్ల మండలం

త్వరగా మంజూరు చేసి ఆదుకోవాలి



వడ్డీకి డబ్బులు తెచ్చి గ్రామంలో పనులు పూర్తి చేశాం. వివిధ పనులకు గాను రూ.23 లక్షలు ఖర్చు పెట్టాం. అధికారులు రికార్డులు సిద్ధం చేశారు. అయినా ఇప్పటి వరకు డబ్బులు రాలేవు. త్వరగా మంజూరు చేసి మమ్మల్ని ఆదుకోవాలి. మాజీ సర్పంచ్‌ల బాధలను అధికారులు అర్థం చేసుకోవాలి.

-సాదా మల్లారెడ్డి, సర్పంచ్, కొత్తగూడ, కందుకూరు మండలం

బిల్లులు రాక అప్పులపాలయ్యాను



రూ.20 లక్షలతో పంచాయతీ భవనం, రూ.5 లక్షలతో క్రీడాప్రాంగణాలను నిర్మించాను. పంచాయతీ భవనాన్ని కూడా ప్రారంభించుకున్నాం. కాగా, బిల్లులు మాత్రం ఇప్పటికీ రాలేదు.ప సొంత డబ్బులతో పనులు చేపట్టాను. బిల్లులు రాక ఇబ్బందిగా ఉంది. రికార్డు అయింది. బిల్లులు రాక అప్పులపాలయ్యాను.

-రాంచంద్రయ్య, మాజీ సర్పంచి, బర్కత్‌పల్లి, పరిగి మండలం

ఎవరికి చెప్పినా ఏం లాభం లేదు



ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.6.50 లక్షలతో సీసీ రోడ్లు, పంచాయతీ ఖర్చుల కింద రూ.2.50 లక్షలు ఖర్చు చేశా. అయితే పనులు చేపట్టి నెలలు గడస్తున్నా బిల్లులు రావడం లేదు. సగమే ఇచ్చారు. ఇంకా సగం రావాల్సి ఉంది. ఎవరికి చెప్పుకున్నా ఏం లాభం లేదు. అధికారులు స్పందించి త్వరగా బిల్లులు ఇప్పించాలి.


-జయమ్మదాస్, మాజీ సర్పంచ్ అంగడిచిట్టెంపల్లి, పూడూరు

పంచాయతీ పోరు.. కసరత్తు షురూ!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఓటరు జాబితా తయారీకి ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. పంచాయతీ ఎన్నికలను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తికాగానే పంచాయతీ ఎనిల్నకలు నిర్వహిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. దీనిపై త్వరలోనే ఓ ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అలాగే ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన ప్రక్రియను కూడా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ఖరారు చేసింది. దీని ప్రకారం సెప్టెంబరు 6వ తేదీన వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా ప్రకటిస్తారు. ఈ జాబితాపై ఉమ్మడి జిల్లాలో సెప్టెంబరు 7వ తేదీ నుంచి 13 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అలాగే ఎన్నికల నిర్వహణకు సంబంధించి 9,10 తేదీల్లో రాజకీయ పార్టీల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. అనంతరం 21న వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. ఇదిలా ఉంటే ఎన్నికల సన్నాహాలకు క్షేత్రస్థాయిలో కూడా అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 29న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లాల కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి గత జనవరి నెలాఖరు నాటికే పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువు దీరాల్సి ఉంది. అయితే, లోక్‌సభ ఎన్నికల కారణంగా పంచాయతీ ఎన్నికలు వాయిదా వేసి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన తీసుకువచ్చారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన తరువాత జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహించాలని సర్కార్ భావిస్తోంది.





- ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ ఖరారు
- సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 21న వార్డుల వారీగా తుది జాబితా ప్రకటన

ఆ గ్రామాల్లో లేనట్లే..

హైదరాబాద్ నగర శివార్లలోని కొన్ని గ్రామాలతో పాటు పురపాలికలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ మహానగరాన్ని మరింత విస్తరించేందుకు ఔటర్ రింగు రోడ్డుకు ఆనుకుని ఉన్న 45 గ్రామాలను ముందుగా సమీప పురపాలికల్లో విలీనం చేసి ఆ తరువాత గ్రేటర్‌లో కలిపేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఇక్కడ ఓటర్ల జాబితా ప్రక్రియ చేపట్టడం లేదు. దీంతో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పంచాయతీ ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గనుంది. పురపాలికల్లో విలీనమయ్యే గ్రామాలు మేడ్చల్ జిల్లా పరిధిలో అధికంగా ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 23 గ్రామాలు ఏడు పురపాలికల్లో విలీనం చేస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 11గ్రామాలను విలీనం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండు పురపాలికల్లో 11 గ్రామాలు విలీనం కానున్నాయి. ఇదిలా ఉంటే శివారు గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనంపై స్థానికంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పంచాయతీల విలీనం వల్ల తమపై పన్నుల భారం పెరుగుతుందని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై న్యాయ పోరాటనికి కొందరు కొందరు సిద్ధమవుతున్నారు.

చెరువుల సర్వేను త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ శశాంక


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21 : జిల్లాలో చెరువుల సర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆర్డీవోలు, ఇరిగేషన్ అధికారులు, హెచ్ఎండీఏ నోడల్ అధికారులతో చెరువుల సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,075 చెరువులుండగా 945 చెరువుల సర్వే పూర్తి చేశామని, ఇంకా 38 చెరువుల సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. వారంలోగా చెరువుల సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు గ్రామ నక్షలను, పహణీలను తీసుకొని క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎలను, బఫర్లను గుర్తించాలన్నారు. అలాగే కడీలను పాతి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించే సమయంలో ఆయా చెరువులకు సంబంధించిన మ్యాప్‌లను వెంట తీసుకెళ్లి పరిశీలించాలని తెలిపారు. ముందుగా క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, ఇరిగేషన్ ఏఈలు సంయుక్తంగా వారి పరిధిలోని చెరువులను పరిశీలించి నివేదికలు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ఫైనల్ సర్వే నిర్వహించిన అనంతరం చెరువుల నివేదికలను హెచ్ఎండీఏకు పంపించాలని చెప్పారు. జిల్లాలోని చెరువులు అక్రమణలకు, రియల్టర్ల కబ్జాలకు గురికాకుండా గట్టి నివారణ చర్యలు చేపట్టడంతో పాటు, ఎక్కడైనా చెరువులు కబ్జాలకు గురవుతున్నట్లు సమాచారం అందితే వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిరాం, వేణుమాధవ్, ఇరిగేషన్ డీఈ నరేందర్‌రెడ్డి, హెచ్ఎండీఏ నోడల్ అధికారి రమాదేవి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక ఆదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో ఎల్ఆర్ఎస్ సర్వేపై సమిక్ష సమావేశం నర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి 2,37, 259 దరఖాస్తులు రాగా అందులో 1,96,154 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులను పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను సరళీకృతం చేయడానికి క్రమబద్ధీకరించడానికి సీజీజీ ద్వారా పారదర్శక ఆన్‌లైన్ సాధనం రూపొందించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 16 మున్సిపాలిటీలలో 2,38,263 దరఖాసుల్తు వచ్చాయని, వీటిని పరిశీలించడానికి ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీపీవో సురేష్‌మోహన్, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిరాం, వేణుమాధవ్, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు చేవెళ్లలో రైతుదీక్ష

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరు కానున్న కేటీఆర్
- దీక్షా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్తీక్‌రెడ్డి
- రైతులు భారీగా తరలి రావాలని విజ్ఞప్తి


రైతు దీక్ష సమావేశం స్థలాన్ని పరిశీలిస్తున్న శంభీపూర్ రాజు, కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 21 : రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం చేవెళ్లలో రైతు దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ దీక్షకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నట్టు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి తెలిపారు. రైతుదీక్ష శిబిరాన్ని నిర్వహించే బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం ఉదయం 9.30 గంటలకు రైతు దీక్ష నిరసన కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డితోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. రైతులను రుణ విముక్తి చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రంగారెడ్డి జిల్లాలో 25 నుంచి 30 శాతం మంది రైతులకు బ్యాంకు రుణాలు మాఫీ కాలేదన్నారు. రైతుల రుణాలన్నీ మాఫీ అయ్యేలా బిఆర్ఎస్ రైతుల పక్షాన ప్రభుత్వంపై పోరాడుతుందన్నారు. ఈ దీక్షకు రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు అనంత్‌రెడ్డి, నర్సింలు, రామగౌడ్, మహేందర్, యాదగిరి, కృష్ణ, రాంప్రసాద్, వెంకటేశ్, చంద్రశేఖర్ రెడ్డి, మాధవరెడ్డి, మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ కాలుష్యంతో ఎండుతున్న వరి

పరిహారమిచ్చి ఆదుకోవాలని రైతుల వేడుకోలు

కొందుర్గు, ఆగస్టు 21: పరిశ్రమ కాలుష్యంతో పంటలు నష్టపోతున్నామని మండల కేంద్రానికి చెందిన రైతులు తెలిపారు. బుధవారం వ్యవసాయాధికారి కార్యాలయానికి రైతులు ఎండిన వరి దుబ్బలనుతెచ్చి చూపారు. కొందుర్గు శివారులో గల గోదావరి స్మెల్టర్స్ ఫ్యాక్టరీ కాలుష్యంతో వరి ఎండిపోయిందని రైతులు వెంకటయ్య, జగదీశ్వర్‌గౌడ్, వెంకటయ్య, తిరుపతయ్య వాపోయారు. వెంకటయ్య రెండెకరాల్లో వరి వేయగా ఫ్యాక్టరీ పొగతో పంట ఎండిపోయిందన్నాడు. తనకు రూ.50వేల నష్టం వచ్చిందన్నారు. 60వేల కౌలుకు తీసుకొని పంటవేయగా ఎండిపోయిందని రైతులు వెంకటయ్య, తిరుపతయ్య చెప్పారు. తమకు 1.4లక్షల ఖర్చు వచ్చిందని, కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. వ్యవసాయాధికారులు స్పందిస్తూ తాము పొలాలకు వెళ్లి పరిశీలిస్తామని తెలిపారు. దీనిపై ఫ్యాక్టరీ ఇన్‌చార్జి రతన్ వివరణిస్తూ.. తమది చిన్న బ్యాటరీ పరిశ్రమ అని, ఫ్యాక్టరీ నుంచి ఎలాంటి కాలుష్యం రాదని, అవసరమైతే రైతులు ల్యాబ్‌టెస్టు చేయించుకోవచ్చని అన్నారు. కాగా పరిశ్రమ కాలుష్యంతో రైతులు పంట నష్టపోతున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. రైతులకు యాజమాన్యం న్యాయం చేయాలన్నారు. ఈ విషయంపై తాను ఏడీఏకు, ఏవోకు సమాచారం ఇచ్చామని తెలిపారు.



పరిశ్రమ పక్కనే ఉన్న వరి చేను



ఎండిన వరి దుబ్బలను చూపుతున్న రైతులు

ఉమ్రాకు బయల్దేరిన యాత్రికులు



ఉమ్రా యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న బంధువులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 21 : శంషాబాద్ విమానాశ్రయం నుంచి ముస్లింలు బుధవారం ఉమ్రా యాత్రకు వెళ్లారు. వారికి కుటుంబ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇల్‌మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎండీ మహ్మద్ ఫయాజ్ అలీ అధ్వర్యంలో 50మంది యాత్రికులు యాత్రకు బయలుదేరారు. వీరు మక్కా, మదీనాల్లో, కాబా వద్ద ప్రార్థనలు చేస్తారు. ఎండీ మాట్లాడుతూ.. ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా మక్కాకు వెళ్లి ప్రార్థనలు చేయాలని కోరుకుంటారని అన్నారు. గతం కంటే ఈ సారి యాత్రికుల భారీగా పెరిగిందని తెలిపారు.

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్

కడ్తాల్, ఆగస్టు 21 : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కడ్తాలకు చెందిన ఎర్రోళ్ల రాఘవేందర్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఈ మేరకు రాఘవేందర్‌కు నియామక పత్రం అందజేశారు. యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్న రాఘవేందర్ బీసీల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పదవి లభించిందని నాయకులన్నారు. తనను నియమించిన, నియామకానికి సహకరించిన ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, నందగోపాల్, ఉదయ్‌కుమార్, వెంకటేశ్, రాధాకృష్ణ, మల్లేశ్, సుధాకర్, రాజ్‌కుమార్‌లకు రాఘవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



రాఘవేందర్‌కు నియామకపత్రమిస్తున్న కృష్ణయ్య



పూజల్లో పాల్గొన్న వెంకటయ్య, లలితవెంకటయ్య, రాముభక్తులు

కట్ట మైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

ఆమనగల్లు, ఆగస్టు 21: ఆమనగల్లులోని కట్టమైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు నిర్వహించే వేడుకలకు ఆలయ చైర్మన్ మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సురసముద్రం చెరువు కట్టపై ఉన్న కట్టమైసమ్మ ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ముదిరాజ్ సంఘం నాయకులు, మత్స్య కారులు, భక్తులు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు. తొలి రోజు అర్చకులు నాగభూషణం, శరత్‌చంద్ర, రామకృష్ణశర్మలు గణపతి పూజ, పుణ్యావచనం, విగ్రహాల ఊరేగింపు, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్.లలితవెంకటయ్య, సంఘ సేవకుడు రాముశ్వేత, నాయకులు వెంకటయ్య, యాదయ్య, చిన్నవెంకటయ్య, అంజయ్య, రాజు, శ్రీనివాస్, ఆంజనేయులు, మల్లేశ్, సాయి, మహేశ్, వెంకటేశ్, మల్లేశ్, పురుగుల శివ, బాలమణి, యాదమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ సంబరాలు



తీజ్ ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు

తలకొండపల్లి, ఆగస్టు 21 : గిరిజనుల సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన తీజ్ వేడుకలను హర్యానాయక్ తండాలో బుధవారం అట్టహాసంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేడుకలు కొనసాగాయి. చిన్నారుల మొదలు వృద్ధుల వరకు వేడుకల్లో భాగస్వాములయ్యారు. మొలకల బుట్టలతో యువతులు, చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం పరిహారమివ్వాలి



రేగడి ఘనాపూర్‌లో టవర్ పనుల వద్ద అధికారులతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 21 : రైతుల పొలాల నుంచి వేస్తున్న పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో ఉన్న రేటు ప్రకారం లెక్కగట్టి పరిహారం ఇవ్వాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. రేగడిఘనాపూర్, ఖానాపూర్, దేవరంపల్లి, అంతారం గ్రామాలమీదుగా ఏర్పాటు చేస్తున్న టవర్ల పనులను రైతులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. రైతులకు పరిహారం ఇచ్చే వరకు పనులు చేయొద్దని అధికారులు, సిబ్బందికి చెప్పి పనులు ఆపించారు. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్మిస్తున్న బీదర్-మహేశ్వరం 765కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్, టవర్ల నిర్మాణం చేవెళ్ల, షాబాద్, కేశంపేట్, కొందుర్గు, ఫారూఖ్‌నగర్, కడ్తాల్, కందుకూరు మండలాల మీదుగా వేస్తున్నారని తెలిపారు. 165కిలోమీటర్ల లైన్‌కు రైతులు 3,000 ఎకరాల వరకు భూమి కోల్పోతున్నారని తెలిపారు. ఈ భూముల మార్కెట్ విలువ ఎకరం కనీసం కోటి నుంచి మూడు కోట్ల వరకు ఉంటుందన్నారు. 2007లో సుప్రీం కోర్టు తీర్పు, 2013 భూసేకరణ చట్టం ద్వారా రైతులకు ప్రభుత్వ రేటు ప్రకారం కాకుండా బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర మేరకే పరిహారం చెల్లించాలన్నారు. రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చే వరకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ పనులను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్‌రెడ్డి, రాంరెడ్డి, రైతులు ఉన్నారు.

సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీపై చర్యలు తీసుకోవాలి



ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21 : అధిక ఫీజులు వసూలు చేస్తున్న సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ పూర్తికాకముందే ప్రైవేట్ కాలేజీల్లో లక్షల్లో డొనేషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యం డొనేషన్ల పేరుతో రూ.17లక్షల వరకు వసూలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని ఇలాంటి కాలేజీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు మమత, రజనీకాంత్, బాయికాడి శంకర్, దొడ్ల వేణు ఉన్నారు.

రుణమాఫీపై భారీగా ఫిర్యాదులు



దరఖాస్తులు ఇచ్చేందుకు గుమిగూడిన రైతులు

బషీరాబాద్, ఆగస్టు21: రుణమాఫీ కాలేదని మండల రైతుల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వీటిలో రైతుల కుటుంబ సభ్యుల వివరాలు నిర్ధారణ జరుగుతోందన్న ఫిర్యాదులు అధికంగా ఉన్నాయని వారంటున్నారు.ఆధార్ నంబర్ల తప్పులు, పాసు పుస్తకాలు, రేషన్‌కార్డుల్లో తప్పులు ఉండటంతో రుణమాఫీ కాలేదని వ్యవసాయాధికారులు బుధవారం దరఖాస్తులు తీసుకున్న గ్రీవెన్స్‌లో రైతులకు వెల్లడించారు. నవాంద్గీ పీఏసీఎస్‌లో ఏఈవో శ్యామేల్ రైతుల నుంచి దరఖాస్తులను తీసుకోవడంతో పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎండీ ఆదేశాలు పట్టించుకోరా?

ఆర్టీసీ కాంప్లెక్స్ షాపులకు తాళాలు • ఆందోళనలో వ్యాపారులు

షాద్‌నగర్‌అర్బన్, ఆగస్టు 21: కొవిడ్-19 లాక్‌డౌన్లతో నష్టపోయిన వ్యాపారులకు దుకాణాల లైసెన్స్‌ను ఏడాది పొడగిస్తూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఇచ్చిన ఆదేశాలను డిపో అధికారులు పట్టించుకోకుండా దుకాణాలకు తాళాలు వేశారని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాద్‌నగర్ బస్టాండ్‌లో 24 షెటర్లు ఉండగా వాటిలో ఆరింటికి గడువు ముగిసిందని బుధవారం ఆర్టీసీ అధికారులు తాళాలు వేశారు. లాక్‌డౌన్‌తో ఏడాదిన్నర అమ్మకాలే జరగలేదని, దీంతో తమ అగ్రిమెంట్‌ను పొడగించాలని ఆర్టీసీ మేనేజ్‌మెంట్‌ను కోరామని వ్యాపారుల తెలిపారు. గడువును ఏడాది మేర పెంచుతూ 2021 సెప్టెంబర్ 4న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సర్క్యులర్ జారీ చేశారన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే శంకర్ దృష్టికి సైతం తీసుకువెళ్లామన్నారు. ఎమ్మెల్యే ఈ నెల 12న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించారని, తాము వినతిపత్రం ఇచ్చామన్నారు. ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవికి సర్క్యులర్ చూపామన్నారు. పాత అద్దె కాకుండా రివైజ్డ్ రెంట్ చెల్లించి ఏడాది పాటు వ్యాపారం చేసుకోవాలని ఆర్ఎం చెప్పగా పాత అగ్రిమెంట్ ప్రకారమే అద్దె ఇస్తామని తెలిపామన్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి దుకాణాలకు తాళం వేస్తే తమ ఉపాధి ఎలా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరో ఏడాది వరకు తమకు అనుమతివ్వాలని కోరారు. కాగా ఈ విషయమై షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం స్పందిస్తూ లాక్‌డౌన్లను దృష్టిలో పెట్టుకుని ఎండీ సర్క్యులర్ ప్రకారమే అగ్రిమెంట్‌ను చేయించుకోవాలని నెల రోజుల నుంచి చెప్పినా వ్యాపారులు పట్టించుకోలేదన్నారు.



దుకాణానికి వేసిన తాళం

ఆర్ఎం ఆదేశాల మేరకే ఆరు షాపులకు తాళం వేశామన్నారు. గడువు ముగిసిన దుకాణాలను ఖాళీ చేయకుంటే తాళం వేస్తామన్నారు. రివైజ్డ్ అగ్రిమెంట్ చేసుకునే వారు తిరిగి వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు.

తల్లిదండ్రులను నిరాదరిస్తే శిక్షార్హులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21: వృద్ధాప్యంలో తల్లిదండ్రులు మంచి వాతావరణంలో గడిపేలా చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలదేనని ప్రిన్సిపల్ సీనియర్ న్యాయాధికారి శంకర్‌శ్రీదేవి అన్నారు. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తే వారి పిల్లలు ఏ స్థాయిలో ఉన్నా చట్టపరంగా శిక్షార్హులని ఆమె చెప్పారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని సెరిన్ సర్వీసెస్ వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. కొందరు తల్లిదండ్రులు భారం అని దూరంపెట్టాలని చూస్తున్నారని, వారు కని పెంచితేనే ఈ స్థాయిలో ఉన్నామనేది ఎవరూ మరిచిపోవద్దన్నారు. కొందరు వృద్ధులు స్వచ్ఛందంగా తామే సెరిన్ సర్వీసెస్ లాంటి ఆశ్రమాల్లో అంటే మంచి వాతావరణంలో ఉండేందుకు ఇష్టపడుతున్నారనే అర్థం అన్నారు. కొందరు తల్లిదండ్రులు కారణాలేవైనా తమ ఆస్తులను పిల్లల పేరున మార్చి ఇబ్బందులు పడుతున్నారని, కాబట్టి తొందరపడి ఎవరూ ఆస్తులను పిల్లలు, ఇతర బంధువుల పేరిట బదిలీ చేయొద్దని ఆమె సలహా ఇచ్చారు. కన్నవారి నిరాదరణకు గురైన తల్లిదండ్రులెవరైనా కోర్టును ఆశ్రయించాలనుకుంటే లీగల్ ఎయిడ్ సర్వీసెస్‌ను సంప్రదించాలని జడ్జి తెలిపారు. వారికి ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. పిల్లలు ఏదైనా ఉద్యోగులై ఉండి వారి సాలరీ సర్టిఫికెట్‌ను కోర్టుకు సమర్పిస్తే వెంటనే జీతంలో కోత విధించి తల్లిదండ్రుల మెయింటెనెన్స్ కోసం బ్యాంక్ అకౌంట్‌లో జమచేసే వెసులుబాటు ఉందని జడ్జి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.అంజన్‌రెడ్డి, సెరిన్ సర్వీసెస్ అధ్యక్షుడు ఎం.భూపాల్ రెడ్డి, బోర్డు సభ్యులు కొల్ల భాస్కర్‌రావు, పాములపాటి నాగశ్వర్‌రావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ న్యాయాధికారి శంకర్‌శ్రీదేవి

సోమారం శివారులో వ్యర్థాల డంప్



సోమారం శివార్లలో డంప్ చేసిన వ్యర్థాలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 21 : మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామ శివార్లలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలను గుట్టు చప్పుడు కాకుండా డంప్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాలం చెల్లిన తిను బండారాలను, కూల్ డ్రింక్, జూస్ బాటిళ్లను పారవేయడంతో వాటిని తిని పశువులు అనారోగ్యం బారిన పడుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. సంబంధిత అధికారులు వ్యర్థాలను డంప్ చేసే వరి పట్ల తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరో ఆరు నెలలు మర్పల్లిలో ఇంటర్ సిటీ రైలు హాల్ట్

చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి



వికారాబాద్, ఆగస్టు 21 : హైదరాబాద్- బీదర్ మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను మరో ఆరు నెలలు హాల్ట్‌కు రైల్వే అధికారులతో మాట్లాడడం జరిగిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. 2024 జనవరి 20వ తేదీ నుంచి హాల్ట్ చేయించడం జరిగిందని, ఆ గడువు పూర్తి కావడంతో దాన్ని నిలిపి వేయాలని అధికారులు నిర్ణయించడంతో నేడు దక్షణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేర్ ఉదయ్ ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. ప్రస్తుతం మరో ఆరు నెలలు హాల్ట్ పొడిగించేందుకు సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పటికైనా మర్పల్లి రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీ రైలుకు రెవెన్యూ పెంచడానికి ప్రతి రోజు కనీసం 40 నుంచి 50 మంది టిక్కెట్లతో ప్రయాణించాలని సూచించారు. ఇన్ని పోరాటాల తరువాత మనం సాధించుకున్న ఇంటర్ సిటీ రైలు హాల్ట్‌ను మర్పల్లిలో కొనసాగించడానికి మీ అందరి సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.

నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టండి

జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్

పెద్దేముల్, ఆగస్టు 21 : నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామంలో నిర్మాణ పనులు జరుగుతున్న హెల్త్‌సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయించాలని అధికారులకు సూచించారు. పనులు నాణ్యతగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. అమ్మఆదర్శ పాఠశాల పనులను, జడ్పీహెచ్ఎస్, యూపీఎస్, పీఎస్ హరిజనవాడ పాఠశాలలను సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మఆదర్శ పాఠశాలలో పనుల పురోగతిపై ఆరా తీశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యాధుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటిపరిసరాల పరిశుభ్రతపై వారికి వివరించి పారిశుధ్యాన్ని నెలకొల్పేవిధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో శంకర్‌నాయక్, ఎంపీడీవో జర్నప్ప, ఎంపీవో రతన్‌సింగ్, పంచాయతీరాజ్ ఏఈ నందిని, ఏసీడీపీవో శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తట్టెపల్లిలో ఆరోగ్యఉపకేంద్రం పనులు పరిశీలించి సుధీర్

అంతారంలో సీసీ రోడ్డు పనులు పరిశీలన

తాండూరు రూరల్: డీఎంఎఫ్‌టీ నిధుల తో చేపట్టిన సీసీ రోడ్డు, అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం పనులను జిల్లాఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్, సీఈవో సుధీర్ పరిశీలించారు. బుధవారం తాండూరు మండలం అంతారం గ్రామంలో ఈడ్గి గోవిందు, ముడుగుల లక్ష్మప్ప ఇంటి వద్ద రూ.4లక్షలతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అదేవిధంగా మరో రూ.4లక్షలతో చేపట్టిన మురుగునీటి కాల్వల పనులను పరిశీలించారు.

అనంతరం గ్రామంలోని పాఠశాలలో మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. సీసీ రోడ్డు కూడా నాణ్యతగా ఉండేలా నిర్మాణం ఏపట్టాలని, ఇప్పటి వరకు పూర్తయిన పనుల్లో నాణ్యతను పరిశీలించడం జరిగిందన్నారు. ఆయన వెంట తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్, డీఎల్‌పీవో శంకర్‌నాయక్, ఏసీడీపీవో శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ నరేందర్, మండల పంచాయతీ ఇన్‌చార్జి అధికారి ఆనంద్‌రావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వడ్డె శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాలలో ప్రతిభ చాటిన బాలబాలికలకు 2025 సంవత్సరంలో అందించనున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ పురస్కార్ అవార్డులకు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవారులు, మెడల్, సర్టిఫికెట్ ఇతర బహుమతులు ఉంటాయన్నారు. ఈ అవార్డుల కోసం 5 నుంచి 18 ఏళ్లలోగా ఉన్నవారు అర్హులన్నారు. అభ్యర్థులు ఇన్నోవేషన్, సోషల్ సర్వీస్, ధైర్య సాహసాలు, పాండిత్యం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కళలు వంటి సేవ రంగంలో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. జాతీయ అవార్డుల పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత కలెక్టరేట్‌లోని మహిళా, శిశు, వికలాంగుల, వయో వృద్ధుల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

మార్పులకు అనుగుణంగా పరిశోధనలు చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 21: ఫార్మాసీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పరిశోధనలు చేయాలని అనురాగ్ యూనివర్సిటీ బీ-ఫార్మాసీ డీన్ వసుధభక్తి తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో స్కూల్ అఫ్ ఫార్మాసీలో స్వాస్థ్య క్లబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మాసీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు పరిశోధనలు చేయాలని సూచించారు. ఫార్మాసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సునంద్, రామ్మోహన్, శిరీష, ఫర్హానా, స్వాస్థ్య క్లబ్ ప్రెసిడెంట్ ధీరజ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ సనూజ, కార్యదర్శి శృతిక రెడ్డి, కోశాధికారి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



అనురాగ్ యూనివర్సిటీలో స్వాస్థ్య క్లబ్‌ను అవిష్కరిస్తున్న ఫార్మసీ డీన్ వసుధభక్తి

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఆగస్టు 21 : జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, జిల్లాఅదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వివరిస్తూ అక్టోబరు 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని, బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలించి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పులు సవరణ వంటి పనులు నిర్వహించడం జరుగుతుందని, ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు వంటి అంశాలపై ప్రతేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే అక్టోబరు 29 న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. వీటిపై సవరణలు, అభ్యంతరాలకు నవంబరు 28 వరకు స్వీకరిస్తారని, డిసెంబరు 24లోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఇంటింటి సర్వే చాలా ముఖ్యమని, ఈఆర్‌వో., ఏఇఆర్, సూపర్వైజర్ల పర్యవేక్షణలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే చేపడతారని, ఇందుకోసం నియోజక వర్గ స్థాయిలో మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, బూత్ లెవల్ ఆఫీసర్ వద్ద ఎలక్టోరల్ జాబితా, పోలింగ్ స్టేషన్ మ్యాప్, వీఐపీ ఓటర్ల వివరాలు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బూత్ లెవల్ ఆఫీసర్లు తమ ఉన్న బి.ఎల్.ఓ. యాప్ లో ఓటర్ల వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలియచేస్తూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఓటు హక్కు నమోదు కోసం 18 సంవత్సరాలు నిండిన యువత వివరాలను బూత్ లెవల్ అధికారుల ద్వారా ముందుగానే సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో ఆర్‌డీవో వాసు చంద్ర, జిల్లా స్థాయి, అసెంబ్లీ స్థాయి, మాస్టర్ ట్రైనర్స్, ఎనికల విభాగము సూపరింటెండెంట్ నేమత్ అలీ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

అక్రమ వెంచర్‌పై విచారణ

తాండూరు, ఆగస్టు 21: తాండూరు పట్టణం నడిబొడ్డున అక్రమంగా చేపట్టిన అక్రమ వెంచర్‌ను తహసీల్దార్ తారాసింగ్ పరిశీలించారు. బుధవారం సిబ్బందికి కలిసి ఆయన లారీ పార్కింగ్ ఎదుట ఉన్న సర్వే నం. 129, 130లలో చేపట్టిన రోడ్డు పనులు, వెంచర్ పనులను పరిశీలించారు. ఈనెల 19న 'ఆంధ్రజ్యోతి'లో 'మున్సిపాలిటీ ఎదుటే అక్రమ వెంచర్' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విధితమే. మాజీ కౌన్సిలర్ సూరజ్ సింగ్ ఠాకూర్ ఈ అక్రమ వెంచర్‌పై కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ప్రసుత్తం ఈ వెంచర్‌పై తాండూరు పట్టణంలో హాట్ టాపిక్‌గా చర్చ కొనసాగుతుంది.

ప్రభుత్వ భూమిగా తేల్చనున్న రెవెన్యూ శాఖ

సర్వే నెం 130లో ఉన్న 36 గుంటల భూమిని ప్రభుత్వ ల్యాండ్‌గా తేల్చాలని జిల్లా అధికారుల నుంచి వచ్చి ఆదేశాముల మేరకు తాండూరు రెవెన్యూ డివిజన్ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. దాదాపు రూ. 25 కోట్ల విలువైన ఈ భూమి సరిహద్దు తేల్చి కాపాడాలని తాండూరు పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రెండు, మూడు రోజులలో గూగుల్ మ్యాప్ ద్వారా సర్వే చేపట్టాలని నిర్ణయించారు.

22, 23 తేదీల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలి

వికారాబాద్, ఆగస్టు 21: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా 22, 23 తేదీల్లో అంతరిక్ష దినోత్సవ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులందరూ భారత్ ఆన్ ది మూన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, వివిధ కార్యకలాపాలను యాక్సెస్ చేయాలని తెలిపారు. అన్ని పాఠశాలలో, డైట్‌లో ప్రత్యేక తరగతులు, వర్క్‌షాపులు, ప్రదర్శనలు లెక్చరర్లు నిర్వహించాలన్నారు. చంద్రయాన్ మాడ్యూల్స్, ఆదిత్య వంటి ఐఎస్ఆర్‌వో అంతరిక్ష విజయాలు, అంతరిక్ష సాంకేతికత మొదలైన వాటి ఆధారంగా, చంద్రయాన్ ఉత్సవ్ మాడ్యూల్స్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఆధ్యాత్మికతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జగద్గురు నిరంజన మఠం పీఠాధిపతి సిద్ధలింగ మహాస్వామి

కొడంగల్, ఆగస్టు 21: ఆధ్యాత్మికతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శ్రీ జగద్గురు నిరంజన మఠం పీఠాధిపతి శ్రీ సిద్ధలింగ మహాస్వామి అన్నారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో కొడంగల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నూతన కార్యవర్గాల ఎన్నిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మికత కోసం కేటాయించాలని పిలుపనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కొహూర్ విజయ్‌వర్ధన్, రాష్ట్ర వీరశైవ జగదేవ్ హీరేమఠ్, నియోజకవర్గంలోని వివిధ మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్ధలింగ మహాస్వామి

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన
పారదర్శకంగా నిర్వహించాలి



ఇబ్రహీంపట్నంలో అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21 : ఎల్‌ఆర్‌ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం(ప్రజా భవన్)లో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పోలీసు అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ అమలుపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో అనధికార లే అవుట్లలో ప్లాట్లకు సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడంతో ప్లాట్ల యజమానులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నందున సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వొత్తిళ్లకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. చెరువు, కుంటల్లో ఆక్రమణలపై కూడా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. సమావేశంలో ఆర్డీవో కె.అనంతరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ కేపీవీ.రాజు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రజాపాలన ధ్యేయం



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

తలకొండపల్లి, ఆగస్టు 21: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గ్రామాల సర్వతో ముఖాభివృద్ధి, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో బుధవారం ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని తన నివాసంలో సమావేశమయ్యారు. ప్రజాసమస్యలు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. తలకొండపల్లిలో నిర్మించిన మాలపోచమ్మ ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షల ప్రొసిడింగ్‌ను నాయకులకు కసిరెడ్డి అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తోందని, పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. ప్రజలకు మౌళిక వసతుల కల్పనే ధ్యేయమన్నారు. రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అబివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అసంపూర్తిగా మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తామన్నారు. రుణమాఫీపై అనుమానాలొద్దని, అర్హులందరికీ తప్పక వర్తింపజేస్తామని అన్నారు. విపక్షాల కుట్రలను రైతులు నమ్మొద్దని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లు, చెరువు, కుంట కట్టలను మరమతులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ అజీం, ఆరిఫ్, రమేశ్, నర్సింహ, పురుషోత్తం, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి

నందిగామ, ఆగస్టు 21: నందిగామలోని బైపాస్ రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం లిబ్యా తండాకు చెందిన నెనావత్ చందు(47) బైక్‌పై భా ర్య జ్యోతితో కలసి నందిగామ నుంచి రాంగ్‌రూట్లో షాద్‌నగర్ వెళ్తున్నాడవు. ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చందు రోడ్డుపై పడడంతో హైద రాబాద్ వైపు వెళ్తున్న లారీ టైర్ చందుపై తలపై నుంచి వెళ్లింది. దీంతో చందు అక్కడికక్కడే మృతిచెందాడు. జ్యోతి, మరో బైక్‌పై ఉన్న యువకుడికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. చందు భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గోపాలక్రిష్ణ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కొత్తూర్, ఆగస్టు 21: కొత్తూర్ సమీపంలో గల వినాయక స్టీల్ ఫ్యాక్టరీ వెనుక రైలుపట్టాలపై బుధవారం వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. 40ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని ఆయన అన్నారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ రహేమత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత



గేదె కళేబరం వద్ద రోదిస్తున్న రైతులు

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 21 :విద్యుత్ తీగలు తగిలి ఓ గేదె మృతి చెందిన ఘటన చిలుకూరులో జరిగింది. మేడిపల్లి బాలయ్య, వెంకటమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఓ గేదె ఉంది. బుధవారం గేదె పొలంలో మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్ కొట్టి చనిపోయింది. దీంతో రైతు దంపతులు రోదించారు. తమకు ప్రభుత్వం ఏమైనా పరిహారం ఇచ్చి ఆదుకోవాలని పేద రైతులు కోరారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



మల్లారెడ్డిగూడలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల, ఆగష్టు 21 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మల్లారెడ్డిగూడ మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో నాలుగో వార్షికోత్సవాన్ని వేదపండితులు, మంత్రోచ్చారణ మధ్య నిర్వహించారు. ప్రతొక్కరూ దైవభక్తితో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రాధికవెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

26 నుంచి గోకులాష్టమి ఉత్సవాలు



నాగర్‌గూడలోని శ్రీకృష్ణ మందిరం; ఆలయంలోని మూల విరాట్టు

షాబాద్, ఆగస్టు 21: కృష్ణాష్టమి(గోకులాష్టమి) నవరాత్రి ఉత్సవాలు మండల పరిధి నాగర్‌గూడలో ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 5 వరకు నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపకులు తాళ్ల సువర్ణశ్రీనివాస్‌గౌడ్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 26న అభిషేకం, అర్చన, తీర్థప్రసాద వితరణ, 27 నుంచి వచ్చే నెల 4 వరకు రోజూ అభిషేకాలు, అర్చన, యజ్ఞం, 5న అభిషేకం, అర్చన. యజ్ఞ పూర్ణాహుతి, డోలారోహణ పూజలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సం ఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్

చేవెళ్ల, ఆగష్టు 21 : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్ అన్నారు. బుధవారం చైతన్య కళాశాలలో డ్రగ్స్ నిరోధం, వాడితే కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. యువత మానసిక బలహీనతతో మాదక ద్రవ్యాలకు అలవాటు పడతారని, ఆ తరువాత వ్యసనం అవుతుందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రదీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ



వివరాలను పరిశీలిస్తున్న అధికారి శిరీష

కేశంపేట, ఆగస్టు 21: మండలంలో పంట రుణాల మాఫీపై ఫిర్యాదుల స్వీకరణను బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో నోడల్ అధికారి శిరీష ప్రారంభించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి, రైతుల సమాచారంతో ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. మండలంలో 250ఫిర్యాదులొచ్చాయని, వాటిని ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఏఈవోలకు ఫిర్యాదు పత్రంతో రైతు కుటుంబీకుల ఆధార్, పట్టా పాస్బుక్, బ్యాంక్ స్టేట్‌మెంట్ కాపీలు వారంలోగా అందజేయాలన్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు నోడల్ అధికారి నియామకం

మాడ్గుల, ఆగస్టు 21: పంట రుణం మాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు నోడల్ అధికారిని నియమించారు. ఏవో అరుణకుమారి దరఖాస్తులను స్వీకరిస్తారు.మండల కేంద్రంలోని రైతువేదికలో దరఖాస్తు స్వీకరిస్తామని, రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

'చలో కామేశ్వర్'ను విజయవంతం చేయాలి

కందుకూరు, ఆగస్టు 21: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయు ఆధ్వర్యంలో తలపెట్టిన చలో కామేశ్వర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయు మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోన కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 24 సంవత్సరాలుగా భోజన పథకాన్ని కార్మికులు నిరంతరంగా అమలు చేస్తున్నా వారి సమస్యలను పరిష్కరించడంలో పాలకులు వివక్ష చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు ప్రభావతి, అశ్విని, అండాలు, లక్ష్మమ్మ, స్వప్న, సుగుణమ్మ, యాదమ్మ, లక్ష్మీదేవి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి : కౌన్సిలర్

ఆదిభట్ల, ఆగస్టు 21: ఆదిభట్ల మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించాలని కౌన్సిలర్ వనం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొంగరకాలన్‌లో బుధవారం మాట్లాడుతూ కొంగరకకలాన్-తండా రోడ్డులో సీసీ పనులు, సింగిల్‌ఫేజ్ మోటారు రిపేర్, వీధీ దీపాలు ఏర్పాటు పనులను నాసిరకంగా చేశారన్నారు. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై పదేపదే బిల్లులు పెట్టుకుంటున్నారని చెప్పారు. మొక్కలు నాటకుండానే బిల్లులు తీసుకున్నారని, సూపర్వైజర్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు నాసిరకం పనులను ప్రోత్సహిస్తున్నారన్నారు.

క్రీమిలేయర్ విధానం వద్దు



షాద్‌నగర్ బస్‌స్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

షాద్‌నగర్, ఆగస్టు 21 : ఎస్సీ, ఎస్టీలకు క్రీమిలేయర్ విధించొద్దని, అలాగే ఎస్సీ రిజర్వేషన్లలో ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించడం రాజ్యాంగ విరుద్ధమని బీఎస్పీ నాయకులు మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తలపెట్టిన భారత్‌బంద్‌కు సంపూర్ణమద్దతు తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పులో ఎస్సీ, ఎస్టీలను క్రీమిలేయర్ విధించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మనువాద అగ్రకుల పార్టీలు వారి అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీలను విభజించాలని పన్నిన కుట్రలో భాగమే క్రీమీలేయర్ అన్నారు. అలాగే ఆర్టికల్ 341కి విరుద్ధంగా రిజర్వేషన్లను రాజకీయంగా వాడుకోవడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై తాము అప్పీల్ చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తలపెట్టిన భారత్‌బంద్‌లో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చే శారు. సమితి అధ్యక్షుడు మహేష్ మాల మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దళితుల మధ్య చిచ్చు పెట్టిందన్నారు. ఇలాంటి తప్పుడు తీర్పులతో దళితుల మధ్య ఐక్యత లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

తలకొండపల్లి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ మాల మహానాడు పిలుపు మేరకు తలకొండపల్లిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ర్యాలీగా తిరిగి విద్యా సంస్థలు, దుకాణాలను బంద్ చేయించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ విషయంలో తెలుగు రాష్ట్రాల సీఎంలు తమ వైఖరిని మార్చుకోవాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజించు పాలిస్తూ కులాల మధ్య చిచ్చు పెడుతోందని నాయకులు మండిపడ్డారు. ఏబీసీడీ వర్గీకరణను రద్దు చేసే ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తలకొండపల్లిలో ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

రైతుల తరపున పోరాడుతాం : ఎంపీ



మేడిపల్లిలో మాట్లాడుతున్నఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 21 : రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, బీజేపీ తరపున రైతుల పక్షాన పోరాడతామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడిపల్లిలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతులతో సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తోందన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసేంత వరకు రైతుల పక్షాన పోరాడుతామన్నారు. రాష్ట్రంలో 70శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, దీనిపై ప్రభుత్వం నుంచి సమాధానం లేదన్నారు. నిజంగా రుణమాఫీ జరిగితే అన్నదాతలు రోడ్డెక్కి ఎందుకు ఆందోళనలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక సన్న వడ్లు పండించే వారికే ఇస్తామని ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, కంజర్ల ప్రకాష్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు పాపయ్యగౌడ్, అంజయ్యయాదవ్, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి, నాయకులు లక్ష్మీపతి యాదవ్, బస్వరాజు, రాజశేఖర్‌రెడ్డి, వీరేష్, గున్నాల గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడికుంట గండి పూడ్చివేత



మేడికుంట గండిని పూడ్చివేయిస్తున్న జీఎల్ఎన్ రెడ్డి, నాయకులు

కడ్తాల్, ఆగస్టు 21: కడ్తాల సమీపంలోని మేడికుంట కట్ట మరమ్మతులకు బుధవారం శ్రీకారం చుట్టారు. కట్ట గండిని తాత్కాలికంగా పూడ్చారు. రెండు రోజులు కురిసిన వర్షాలకు మేడికుంటలోకి భారీగా వర్షపు నీరు చేరింది. నీటి ఉధృతికి కట్టకు గండి పడి మంగళవారం నీరంతా వృధాగా పోయింది. ఈ విషయాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ నేతలు మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి బీఆర్ఎస్ నేతలతో వేర్వేరుగా గండిని పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య కట్టను పరిశీలించారు. గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి గండిని ఎక్స్‌కవేటర్‌తో పూడ్చేయించారు. కుంట కట్ట పనులపై ప్రభుత్వానికి నివేదిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, నర్సింహ, సిద్ధిగారి వెంకటేష్, మూడ రవి, పురుషోత్తం, గూడెపు మహేశ్, కాలె శ్రీను, కంబాల శ్రీకాంత్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులపై ప్రభుత్వానికి నివేదించాం : తహసీల్దార్

మేడికుంట చెరువు కట్ట మరమ్మతు, ఆధునికీకరణ గురించి ప్రభుత్వానికి నివేదించినట్లు తహసీల్దార్ ముంతాజ్ తెలిపారు. కట్టకు పడిన గండిని తాత్కాలికంగా పూడ్చామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, త్వరలోనే గండికి మరమ్మతులు చేసి కట్టను బాగుచేస్తామన్నారు.

పద్మావతి కన్వెన్షన్ హాల్ ప్రారంభం



కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎంపీ

చేవెళ్ల,ఆగస్టు 21:మండల పరిధి మల్కాపూర్ స్టేజి సమీపంలో చేవెళ్ల మాజీ జడ్పీటీసీ ఎం.మాలతికృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన పద్మావతి కన్వెన్షన్ హాల్‌ను బుధవారం ప్రారంభించారు.కార్యక్రమ ముఖ్యఅతిథులు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డిలతో కలిసి ఓనర్లు హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఆధునిక హంగులతో నిర్మించిన పద్మావతి కన్వెన్షన్ హాల్ ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అనుకులంగా ఉందన్నారు. ఇంత బాగా నిర్మించిన యజమానులను అభినందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్ స్వామి, మాజీ జెడ్పీటీసీ మాలతికృష్ణారెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సతీష్‌కుమార్‌గుప్తా



సతీష్‌కుమార్‌గుప్తా

కొత్తూర్, ఆగస్టు 21: రంగారెడ్డి జిల్లా రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇన్ముల్‌నర్వకు చెందిన శివసతీష్‌కుమార్‌గుప్తాను అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి ఆధ్వర్యంలో సతీష్‌కుమార్‌గుప్తాను, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా డి. సత్యనారాయణ, కోశాధికారి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, జనార్ధన్‌రెడ్డి, రంజిత్‌కుమార్, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, కార్యవర్గసభ్యులు ప్రకాశ్, బుచ్చిలింగం, చెరుకు యాదయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సతీష్‌కుమార్‌గుప్తా తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిషేధిత జాబితాలో పట్టాభూమి

● సరిచేయాలని తలకిందులుగా రైతు నిరసన

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21: తన తల్లి పేరిట ఉన్న పట్టా భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగంచాలంటూ ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఓ యువకుడు బుధవారం సాయంత్రం తలకిందులుగా నిల్చొని నిరసనకు దిగాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లిలోని సర్వే నంబర్ 374లో మొత్తం ఉన్న విస్తీర్ణం పదెకరాలు. కాగా ఇందులో ఉల్లింతల జయసుధ అనే మహిళ పేరిట ఎకరం పట్టా భూమి ఉంది. ఇదే నంబర్‌లో మరొకరి పేరున 1.30ఎకరాలు ప్రభుత్వ సీలింగ్ భూమి ఉంది. దీంతో ధరణి పోర్టల్‌లో ఈ సర్వే నంబర్‌లో ఉన్న మొత్తం విస్తీర్ణాన్ని నిషేధిత జాబితాలో చేర్చారు. తమ పట్టా భూమిపై నిషేధాన్ని తొలగించాలని రైతులు జయసుధ, ఆమె కొడుకు ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా అధికారులు సమస్య పరిష్కరించడం లేదని జయసుధ కొడుకు జీవన్ తహసీల్దార్ కార్యాలయంలో తలకిందులుగా నిరసన తెలిపాడు. దీంతో తహసీల్దార్ సునీతారెడ్డి జోక్యం చేసుకుని సీలింగ్ పట్టా ఎక్కడ ఉందో సర్వే చేయించి పట్టా భూమి ఉన్నట్టయితే నిషేధిత జాబితా నుంచి సదరు విస్తీర్ణాన్ని తొలగిస్తామని చెప్పారు. దీంతో జీవన్ ఆఫీసు నుంచి వెళ్లిపోయాడు.



తలకిందులుగా నిలుచొని నిరసన తెలుపుతున్న జీవన్

సంక్షిప్తంగా...

● **కొత్తూర్:** ఓటర్ లిస్టులోని తప్పులను సరిచేయాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి బీఎల్‌వోలకు సూచించారు. బుధవారం బీఎల్‌వోలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలల పాటు బీఎల్‌వోలు ఇంటింటి సర్వేలు చేసి ఓటర్ల సమగ్ర రిపోర్టు తయారు చేయాలన్నారు. 18ఏళ్లు నిండిన యువతీ, యువకుల వివరాలు సేకరించాలన్నారు. చనిపోయిన, రెండు సార్లు నమోదైన వారి పేర్లను తొలగించాలన్నారు.

● **శంకర్‌పల్లి:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని చెవేళ్ల సీఐ వెంకటేషం తెలిపారు. దొంతాన్‌పల్లి వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, ఇస్తే కేసు లు తప్పవని హెచ్చరించారు. అతివేగంగా వాహనాలను నడపొద్దని సూచించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలే అన్నారు. జీబ్రా క్రాసింగ్ లైన్స్, ట్రాఫిక్ సిగ్నల్ గురించి అవగాహన కల్పించారు.

● **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ 2024-25 సంవత్సరానికి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా చింతల నర్సింహ, సెక్రటరీ పండగ బాల్‌రాజ్, కోశాధికారిగా గుంటి భీంరావు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా ఇన్నాలయన్ ఆఫీసర్ కళ్లెం కృష్ణారెడ్డి, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ జితేందర్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో లయన్ ఇందూరి శ్రీనివాస్, కేవీ.రమేష్‌రాజు, పాండురంగారెడ్డి, ఆకుల యాదగిరి, నెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● **ఇబ్రహీంపట్నం:** అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం చౌరస్తాలో రైతు ధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు.

● **కొత్తూర్:** మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ ఆర్కే కాలనీలో పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం కొనసాగింది. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరపీడితులను పరిక్షిస్తున్నారు. రక్త నమూనాలు సేకరించి, డెంగ్యూ పరీక్ష కోసం హైద్రాబాద్ పంపారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీ కాలనీలో ఫాగింగ్ చేయిస్తున్నారు.

● **కడ్తాల్:** కడ్తాల ఎస్సీ కాలనీ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయంలో వాన నీరొచ్చింది. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. నీరు రాకుండా పైప లైన్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

మైసిగండి, ఆమనగల్లుల్లో కార్డన్ సెర్చ్



మైసిగండిలో దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏసీపీ రంగస్వామి

ఆమనగల్లు, ఆగస్టు 21 : ఆమనగల్లు, కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయం వద్ద బుధవారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 8 మంది ఎస్ఐలు, సబ్ డివిజన్ పరిధి 65మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రోడ్లపై వాహనాలు, కిరాణ దుకాణాలు, అనుమానిత ప్రాంతాల్లో తనిఖీ చేశారు. గంజాయి, డ్రగ్స్, గుట్కాలు, నాటు సారా, బెల్టు షాపుల నివారణలో భాగంగా కార్డన్ సెర్చ్ చేశామని సీఐలు శివప్రసాద్, ప్రమోద్‌కుమార్ తెలిపారు. బెల్ట్ షాపుల్లో మద్యం, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుల్లో ఏడు ఆబ్కారి, ఒక గుట్కా కేసు నమోదైనట్టు ఏసీపీ తెలిపారు. ఫంక్షన్ హాళ్లు, రిసార్టుల్లో అనుమల్లేకుండా లిక్కర్, కాక్‌టెయిల్ ఈవెంట్లు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. కార్డెన్‌సెర్చ్‌లో ఎస్సైలు సత్యనారాయణ, విజయ్‌కుమార్, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, ఎస్సైలు వెంకటేశ్, వరప్రసాద్, శ్రీకాంత్ ఉన్నారు.

హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య

చేవెళ్ల, ఆగస్టు 21 : ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీ హోటల్‌లో యజమానులు పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు తెలిపారు. బుధవారం చేవెళ్ల పంచాయతీ కార్యాలయంలో హోటల్ యజమనులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. హోటళ్లలో పరిశుభ్రత పాటించకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాఘవేందర్, సిబ్బంది, హోటల్ యాజమానులు ఉన్నారు.

ఎంపీ రవి, వీహెచ్‌లను కలిసిన రాఘవేందర్



హనుమంతరావుతో ఎర్రోళ్ల రాఘవేందర్

కడ్తాల్, ఆగస్టు 21 : కడ్తాలకు చెందిన యువజన సం ఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ బుధవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీహెచ్ హన్మంతరావులను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. బీసీల రిజర్వేషన్ల పెంపు, యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన తదితర అంశాలపై వారికి వివరించగా సానుకూలంగా స్పందించినట్లు రాఘవేందర్ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటు



ఆదిభట్ల, ఆగస్టు 21: ఆదిభట్ల మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ సమస్యల పరిష్కారానికి అధికారులు బుధవారం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్-2020పై ఏదైనా సమస్యలుంటే టౌన్ ప్లానింగ్ అధికారి ఎస్ హాబీ బున్నీసా 8328396716, హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జి భాస్కర్ 9391122665, సెక్షన్ అసిస్టెంట్ వంశీ 6303782905లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

శంషాబాద్‌లో విద్యార్థుల ర్యాలీ



శంషాబాద్, ఆగస్టు 21:కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం శంషాబాద్‌లో ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. నిందితుడికి కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు.